# షరాబ్ బజార్

విశ్వం షరాబ్ బజారు ఇరుకు సందుగుండా నడుస్తున్నాడు. అతను స్వతహా పిరికివాడుకాడు. కాని పరిస్థితులు కొంచెం పిరికి మందు నూరి పోస్తే జీర్ణించుకోలేక కొంత జబ్బు పడ్డాడు. అయినా అతను ధైర్యస్థుడనే చెప్పాలి. కొత్త ఊళ్ళో మూడు నెలలు టెంపరరీ పోస్టులో ఎల్. డి. సి. చేసి ఊస్టయినా, రాబోయే వేకెన్సీలో పోస్టింగ్ కోసం ఓపిగ్గా లేచి ఉన్నాడు. జేబులో చిల్లర డబ్బులు తప్ప టోకు ఏమీ లేకపోయినా ధైర్యంగా తలెత్తుకుని షరాబ్ బజార్లో నడిచి పోగలడు. కాని వాస్తవానికి, అలా ఆ బజార్లో నడుస్తుంటే అతనికి కొంచెం బెరుగ్గానే ఉంటుంది. ఆరోజు మరీ. ఏందుచేతంటే, విశ్వం ఆసాయంకాలంలోగా షరాబ్ బజార్లో కొన్ని వస్తువులు ఖరీదుచేయాలి, అందుకోసం జేబులో సుమారు ఓ యాభై రూపాయలైనా వేసుకోవాలి. యాభై. అంటే అంతకంటే ఓ పైసాకూడా తను సంపాదించలేడు. ఆందులోనే తనకి కావలసినవన్నీ కొనాలి. కాస్తోకూస్తో మిగుల్చుకోవాలి.

విశ్వం కొంచెం భయంగా రోడ్డుకి రెండు వైపులా పెద్ద పులుల్లా నోళ్ళు తెరుచుకున్నట్లు, తలుపులు తెరచుకొన్న షాపుల్ని చూసి, కళ్లు మూసుకున్నాడు. ఆరోజెందుకో షరాబ్ బజార్ని చూస్తుంటే భయం భయంగా ఉంది.

పట్నానికి వచ్చిన కొత్తలో "ఊళ్ళో చూడాలిసిన విశేషాలేమున్నాయి?" అని ఓ మిత్రుడిని అడిగితే అతను "షరాబ్ బజార్!" అన్నాడు. నిజమే తను షరాబ్ బజారు మీదుగా వెళ్ళిన మొదటి సాయంకాలమే ఆ విషయం

తెలుసుకున్నాడు. మెలికలు తిరిగి జర్రున జారిపోతున్నట్టున్న పాము లాంటి ఆ వీధి ! చుట్టూ పోటీలుపడి పైపైకి సాగిన మేడలు ! షాపుల్లోని అపురూపమైన వస్తువులు ! వెండి బంగారాలు ! ఓ హో ! బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీ ఆఫీసులు – అన్నింటినీ మించి బేరసారాల సందడి. పట్నానికి ఆ బజారు ప్రాణం. వెన్నెముక. అందులోంచి నడవటమే ఓ విజ్ఞానం కాని.... కాని—

విశ్వానికి హృదయంలో తెలివిగా తోచింది. పూర్వం బజారు మధ్యలో మంచినీటి గాడిబావి ఉండేదట. ఎడితెరిపి లేకుండా బావినీళ్ళు జనం తోడుకుపోతూండేవారట. అక్కడ-తులసి వనంలో గంజాయి మొక్కలా ఆ బావి ఎబ్బెట్టుగాతోచి షరాబ్ బజారు ప్రముఖులు దాన్ని పూడ్పించారట. ఆ భావి గిలకల చప్పుళ్ళు అపశ్రుతి పలుకుతున్నట్టుండేది కాబోలు!

విశ్వం మనసు గజిబిజిగా ఉంది. త్వరత్వరగా నడిచాడు. అతని ముఖం వికసించింది. షరాబ్ బజార్ కొసకి చేరుకున్నాడు.

పెద్ద ఆవరణలో గొప్ప భవనం. ఆవరణచుట్టూ ప్రహరీగోడ. మామూలుగా షికారు వచ్చినప్పుడు ఆ ప్రహరీగోడవైపు చూడకుండా త్వరగా వెళ్ళిపోయేవాడు విశ్వం. ఆరోజు చిరునవ్వుతో బోర్డుచూశాడు. 'ఆసుపత్రి' అంటే అతనికి వాసనా పూర్వకమైన భయం. కాని 'బ్లడ్ బ్యాంక్' అన్న పేరుచూసి విశ్వం వికసిత వదనంతో గేటు తోసుకుని లోపలికి పోయాడు. వరండా చేరి ఓ క్షణం నిలబడ్డాడు.

నర్సులు, వార్డుబాయ్‌లు, తోటీలు ఎవరి పనిమీద వారు తిరుగు తున్నారు. విశ్వం వరండా దాటి డాక్టర్ గది దగ్గర ఓ క్షణం తచ్చాడాడు.

"ఏం కావాలండీ ?" అప్పుడే చేతిలో ఛార్టుతో గదిలోంచి వస్తూ ఓ నర్సు విశ్వాన్ని పలకరించింది.

New Mirzalguda. Secunderabad



"రక్తదానం చేస్తానండీ." అన్నాడు విశ్వం వెంటనే నర్స్ విశ్వాన్ని డాక్టర్ దగ్గరికి తీసుకు వెళ్ళింది. "లీటర్‌కి ఇరవైఅయిదు రూపాయిలు" అన్నాడు, డాక్టర్ కాలం వృధా చేయకుండా.

"అలాగే డాక్టర్‌గారూ. నేను రెండులీటర్లు దానం చేస్తాను." అన్నాడు విశ్వం. దానం అనేమాట అతనికే అసహ్యంగా వినిపించింది,
ఒక్కసారి లీటర్ కంటే ఎక్కువ తీసుకోం.'

విశ్వం ముఖంలో ఆశాభంగం తాండవించింది. "నేనుచాలా ఆరోగ్యంగా ఉన్నాను డాక్టర్. రెండు లీటర్లు ఇవ్వగలను. దయచేసి తీసుకోండి' ప్రాధేయ పూర్వకంగా అన్నాడు విశ్వం.

డాక్టర్ ఏమీ అనలేదు. అతని రక్తం పరీక్షించి గ్రూప్ నిర్ణయించాడు. రక్తం తీసుకోమని ఆర్డర్ జారీచేశాడు.

రక్తం సీసాలో నిండుతుంటే, విశ్వం మనసులో ఆలోచనలు తెరలు, తెరలుగా రాసాగాయి. రక్తం తీసిన తర్వాత పళ్ళు పాలు తెచ్చి ఇచ్చారు. యాభై రూపాయలు చేతిలో పెట్టారు,

విశ్వం హాస్పిటల్ ఆవరణ దాటి బయటికి వచ్చాడు. ఎంతో ఉత్సాహంతో ఈల వేశాడు. "బ్లడ్‌బ్యాంక్' బోర్డువైపు చూసి "థ్యాంక్యూ" అన్నాడు. తర్వాత ఠీవిగా తలెత్తుకు షరాబ్ బజార్లో ప్రవేశించాడు.

ఒక మంచి ఉంగరం కొనాలి. అదే, ముప్పైలోపు వచ్చేది. కొన్ని చిల్లర ఖర్చులున్నాయి. ప్చ్. యాభై ఏమూలకి ! కాని అంత కంటె తను ప్రస్తుతం సమకూర్చలేడు.

విశ్వం వెండి బంగారాల దుకాణాల మెట్లెక్కి, ఏదో ఆలోచనరాగా ఆగిపోయాడు. సుజాత సెలెక్టు చేయాలి. తనకేం తెలుస్తుంది ? అతను దుకాణాలలోకి తొంగిచూచి టైం చూశాడు. అయిదు దాటింది. సుజాత వస్తూ ఉండాలి. ఆఫీసులో అయిదు దాటిం తరవాత ఎవరూ ఉండరు. ఆమె ఇదే

దారిన ఇంటికి వెడుతుంది. విశ్వం మెట్లుదిగి రోడ్డుకి పక్కగా నిలబడి రోడ్డు చివరిదాకా చూస్తూ సుజాత రాకని నిరీక్షించసాగాడు.

అదిగో తెల్లచీర సన్నటి ఆకారం. దూరంలో—మెరిసేతారలా విశ్వం కళ్ళలో కాంతి పుంజాలు ప్రతిఫలించాయి. ఇంతలోనే ఆమె దగ్గరగా వచ్చింది.

"సుజాతా?" అన్నాడు ప్రేమగా.

ఆమె ఉలిక్కిపడి చూసి, మందహాసంచేసి "మీరా!" అంది.

"నీ కోసమే చూస్తున్నాను. దుకాణంలోకి పోదాం, పద"

"ఎందుకు?"

"ఉంగరం సెలెక్టు చేద్దువుగాని."

సుజాత కళ్ళు తళుక్కుమన్నాయి. కళ్ళెత్తి అతన్ని క్షణం చూసింది.

"రేపు రిజిష్ట్రార్ ఆఫీసులో మనం—" అన్నాడు వాక్యాన్ని అసంపూర్తిగా ముగిస్తూ విశ్వం.

సుజాత వదనంలో కొత్త కళ వచ్చింది. అప్రయత్నంగా ఆమె తల కిందికి వంచి విశ్వాన్ని క్రీగంట చూసింది. అతను పరవశించి పోయాడు. ఆమె తన వ్రేలిన ఉన్న ఉంగరం చూసుకుంది.

"ఉంగరాలు మార్చుకోవాలి," అన్నాడు విశ్వం. అంటూనే దుకాణంలోకి దారితీశాడు. ఆమె అతన్ని అనుసరించింది.

ఒక ఉంగరం సెలెక్టుచేశారు. నలభై దాకా అయింది. అంగడి బయటికి వచ్చారు. విశ్వం ఉల్లాసంగా ఉన్నాడు. అతని మనసు గతాన్ని స్మరించసాగింది. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు, తన సీటులో కూర్చుంటూ యథాలాపంగా ఎదురుగా చూశాడు. ఆలోచనగా పరాకుగా చూస్తున్న రెండు కళ్ళు తటాలున తన కళ్ళలోకి చూశాయి. మెరుపు మెరిసినట్లయింది. ఆ కళ్ళలో ఎంత ఆకర్షణ! ఆ ఆకర్షణ తనని మంత్ర ముగ్ధుణ్ని

చేసింది. ఆ క్షణంనించీ సుజాత అంటే తనకి పంచప్రాణాలు. తనలో ఏ ముందోగాని సుజాతకి తనంటే ఎంతో అభిమానం. మొదట్నించీ తన అదృష్టం కొద్దీ అది తనమీద ప్రేమగా మారింది. ఇద్దరూ మర్నాడు వివాహం చేసుకోబోతున్నారు.

"డబ్బెక్కడిది?" అంది సుజాత అతని ఆలోచనలకి భంగం కలిగిస్తూ.

విశ్వం తటపటాయించాడు.

"అప్పా!" అందామె.

విశ్వం అబద్ధం చెప్పదలచుకోలేదు.

"సంపాదించాను." అన్నాడు గర్వంగా.

"ఎలా ?"

"తర్వాతచెప్తా" అన్నాడతను, నిజం చెప్పటం ఇష్టంలేక.

"చెప్పకూడదా ! " అందామె రెట్టిస్తూ.

చెప్తే తప్పేమిటనిపించింది విశ్వంకి. అందువల్ల ఆమెమీద తన కెంత ప్రేమో నిరూపణ అవుతుంది. పిచ్చిపిల్ల, కంగారుపడి పోయింది. ఆమెని నడిసముద్రంలో వదిలేసి పోతాడేమోనని భయపడ్డది. అవన్నీ పిచ్చి ఊహలు, తనని విశ్వం ఎన్నడూ వదలి ఉండదనీ, అతని ప్రేమ అంత బలమైందనీ ఆమె తెలుసుకుంటే ఆమె హృదయం సంతోషంతో నిండి పోతుంది,

"అలా కంగన్‌హాల్‌కి పద చెప్తా. "అన్నాడు విశ్వం.

ఇద్దరూ కంగన్‌హాలుకి వెళ్ళారు. ఆమె చేతులనిండా గాజులు తొడిగించు కుంది. ఆ మధుర మంజుల స్వరం వింటుంటే విశ్వంలో అనురాగం కట్టలు తెంచుకుంది. కంగన్‌హాలు దాటివస్తుంటే సుజాత మళ్ళీ అడిగింది.
"ఆసుపత్రి వాళ్ళు నా దగ్గర రక్తం కొనుక్కున్నారు-" అవును. యూ ఫైకి "అన్నాడు విశ్వం.

సుజాత తటాలున అతని కళ్ళలోకి చూసింది. ఆ చక్కటి కళ్ళకి కన్నీటి తెరలెందుకో విశ్వంకి అర్థంకాలేదు.

"ఏముందీ, మామూలుగా వస్తువుల్ని అమ్మటంలా, ఇదీ అంతే. తేపీపాటికి రక్తం పట్టదూ ?" అన్నాడు కొంత నిర్లక్ష్యంగా.

సుజాత ఏమీ అనలేదు, విశ్వానికి కొంత అసంతృప్తిగాఉంది. "రక్తమూ ఓ ధరగల వస్తువే సుజా!" అన్ని వస్తువుల్లా రక్తాన్నీ అమ్మవచ్చు, కొనవచ్చు" అన్నాడు. సుజాత పెదవులు బిగబట్టింది. "రేపు తప్పక రిజిస్టర్ మేరేజి చేసుకుందాం అన్నాను" కదా సుజాతా, మరి ఉంగరాలు మార్చుకుంటే బాగుంటుందని – అతను ముగించటం అనవసరం అనుకుని ఆపేశాడు."

సుజాత ఏమీ వింటున్నట్టులేదు. హారన్ ఎన్నిసార్లు మోగించినా ఆమె ఎదురుగావచ్చే కారు తప్పించుకోలేదు. చప్పున విశ్వం ఆమెని ప్రక్కకి లాగాడు. కాని వెనకినుంచి చిన్నకారు వస్తూ ఆమెని తప్పుకోబోయి విశ్వాన్ని ఢీకొంది. ఏక్సిడెంటయింది. ఏం జరిగిందీ అస్పష్టంగా తెలిసి సుజాత కెవ్వుమంది.

"రక్తం బాగా పోయింది. కనీసం రెండు లీటర్లు రక్తం అర్జంటుగా ఎక్కించాలి, లేకపోతే ప్రమాదం." అన్నాడు డాక్టరు.

"నా రక్తం తీసి ఎక్కించండి డాక్టర్." అంది సుజాత ఆదుర్దాగా, గద్గదిక స్వరంతో.

సుజాత రక్తం పరీక్షించాడు డాక్టర్. కాని ఆమె రక్తం "గ్రూపు" వేరు. ఆ మాట డాక్టర్ చెప్పగానే ఆమె ముఖం కళా విహీనమైంది.

"వేరే ఎవరైనా ఉన్నారా ?"

ఎవరున్నారు ? ముసలితల్లీ, తన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు-చిన్న చిన్న పిల్లలు. ఈ భారాన్నంతా ఎలాగో ఈదు కొస్తుంటే, తెప్పకొయ్యలా విశ్వం ఆదు

కున్నాడు....ఆర్థికంగా కాకపోయినా, చేదోడు వాదోడుగా. "ఎవరూ లేరండీ డాక్టర్‌గారూ, మీరే రక్షించాలి.

ముప్పయి అయిదేళ్ళ వయస్సులో చెట్లల్లే ఉన్న అంత డాక్టరూ వరి మెక్కలా అటూఇటూ ఊగి "నేనేం చెయ్యగలను., రెండు లీటర్లు వంద రూపాయలవుతుంది. డబ్బు హాస్పటల్లో కట్టాలి.'' అన్నాడు.

సుజాత హతాశురాలైంది. వందరూపాయలు ఎక్కడనుంచి వస్తాయి? తమ బ్రతుకు దినదిన గండం. 'డాక్టర్‌గారూ, దయవుంచండి. ఆయన ఇవాళే, ఇంత క్రితమే ఈ ఆసుపత్రికే రెండు లీటర్లు రక్తదానం చేశారు. దయ చేసి వారి రక్తం వారికి ఇచ్చివెయ్యండి. మీరిచ్చిన డబ్బు ఎలాగో ఇచ్చి వేస్తాను." దీనంగా అడిగింది. సుజాత.

డాక్టర్ కొంచెం ఆశ్చర్యంగా చూశాడు. తర్వాత పక్కన ఉన్న నర్స్‌వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎస్ డాక్టర్. అతను రక్తదానం చేశాడు. ఆమె చెప్పింది నిజమే.'' అంది నర్స్.

"ఆర్‌యూస్యూర్'' అన్నాడా డాక్టర్ కొంచెం కోపంగా. నర్స్ కొంచం తడబడ్డది.

"పేషంట్‌ని చూడగానే గుర్తుపట్టాను. తర్వాత పేరు, వివరాలు చూస్తే సరిపోయాయి డాక్టర్,'' అందామె.

డాక్టర్ ముఖం కరుడుగట్టింది.

"సారీ. అయినా మేం రక్తం సప్లై చేస్తే, మా రేటు ప్రకారం డబ్బివ్వ వలసిందే. నేనేం చేయలేను.''

అని చరచర డాక్టర్ రూమ్‌కి వెళ్ళిపోయాడు.

సుజాతకి గుండె ఆగిపోయినట్లయింది. విశ్వం అచేతనుడై పడివున్నాడు. త్వరలో రక్తం ఇవ్వకపోతే ప్రాణాపాయం. తనేం చేయాలి ? ఎలాగో ఆ డాక్టర్ కాళ్ళుపట్టుకోవాలి.

సుజాత త్వర త్వరగా డాక్టర్ని అనుసరించింది. డాక్టర్ గదిలోకి వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు. బెల్ కొట్టబోయి ఎదురుగా ప్రత్యక్షమైన సుజాతని చూసి చిరాకుపడి ఆగాడు.

"డాక్టర్‌గారూ ఆయన లేకపోతే నాజీవితం నాశనమై పోతుంది. మా కుటుంబం నిరాధారమైపోతుంది. దయ తలచండి." అంది సుజాత బతిమాలుకుంటున్నట్టు.

డాక్టర్ ఓ క్షణం ఆమె వైపుచూశాడు. పచ్చటి ఆమె వదనానికి ఎర్రబడిన కళ్ళు వింతసోయగాన్ని చేకూరుస్తున్నాయి. జుట్టుగాలిలో నాట్యంచేస్తూ ఆమె నున్నటి బుగ్గలతో దోబూచులాడుతున్నాయి.

"ఆయన నీకేమవుతాడు ?" అన్నాడు డాక్టర్. మరొకరి నైతే" గెటౌట్" అనేవాడే కాని, అందమైన సుజాతని అతను కసరలేకపోయాడు.

సుజాత తన పచ్చటి చేతుల్ని అలంకరించిన ఎర్రఎర్రటి గాజుల్ని చూచుకుంది.

"రేపు మాకు వివాహంజరగవలసినరోజు." అంది దుఃఖాన్ని ఆపుకుంటూ, ఆమె. "ఇంకానయం" అన్నాడు డాక్టర్. అని నాలుక కరుచుకున్నాడు. "కాని తప్పదమ్మాయ్, వందరూపాయలు ఇవ్వవలసిందే. హాస్పటల్ రూల్స్"

"ఎలాగో సహాయం చేస్తే మీమేలు —"

"నాజేబులోంచి ఇవ్వమంటావా !" "అన్నాడు డాక్టర్ ఆమెమాటల్ని మధ్యలోనే తుంచివేస్తూ.

సుజాతకి ఏదో ఆవేశం కలిగింది,

"ఇస్తే మీ ఋణం ఎలాగో తీర్చుకుంటాను తప్పక." అంది తొణికే పెదవుల్తో.

మాటల్తో పనికాదు. ప్లీజ్_వెళ్ళు నాకుపనుంది. త్వరగా వందరూపాయలు తెస్తే నా పని నేనుచేస్తాను."

డాక్టర్ ముఖం చిట్లించుకొని, ఏవో కాగితాలు ముందేసుకున్నాడు.

అనిమేషంగా సుజాత డాక్టర్‌వైపు చూసింది. ఆమెకళ్ళలో విశ్వం మెదిలాడు. తనకోసం రక్తం ఇచ్చిన విశ్వం. తనసుఖం కోసం, తన పరువు కోసం, తన ప్రాణం కోసం—

"మీకే మండీ బి.ఏ. క్లాసులో ప్యాసయారు."

"మీరు డ్రాప్టు రాసినట్టు ఏవరు రాయగలరండీ!" ఎంత నిజాయితీ! ఈ రోజులలో మీలాంటి వాళ్ళుండరండీ."

"పెద్ద ఉద్యోగం వస్తే మమ్మల్ని మర్చిపోరూ ?"

"ఈ ఉద్యోగం పోతే ఏమండి, రేపీపాటికి రాజాలాంటి ఉద్యోగం రాదూ, ?"—

అని అనునయంగా తను మాట్లాడుతుంటే, ఎంత ఆత్మవిశ్వాసంతో, ఎంత ఉత్సాహంతో జలపాతంలా హుషారుగా తిరిగేవాడు. ఆ కళ్ళలో తనంటే ఎంత అభిమానం ఒలికించేవాడు :

"నాకు పనుందని చెప్పానుగదూ !" అన్నాడు డాక్టర్, సుజాత కదలక నుంచుని ఉండటంచూచి.

సుజాత మాట్లాడలేదు. నిస్పృహతో అతనివైపు చూచింది. విశ్వంకి జరిగిన అన్యాయం ఆమెని నిలువునా దగ్ధంచేస్తోంది. ఇది హత్యకంటె కనాకష్టం. నిలువుదోపిడికంటె ఘోరం. ఆమె కోపంతో వొణకసాగింది. తన అసహాయతకి కుమిలి పోసాగింది. ఏమైనా డాక్టరే దిక్కు. దీనంగా అతనివైపుచూసింది. దగ్గరగా వెళ్ళింది. పెదవులు కంపించసాగాయి. మాటలు పెగలటంలేదు.

'మీరె రక్షించాలి డాక్టర్‌గారూ." అభిమానం విడిచి పాదాలమీద పడబోయింది. డాక్టర్ తటాలున ఆమెని పట్టుకుని "హుష్" అని వారిస్తూ, చలించే ఆ ఎర్రటి పెదవుల్నిచూసి మోహా వేశంలో వొళ్ళుమరచి ఆమెని కౌగిలిలో అదిమి, పెదవుల్ని చుంబించాడు. సుజాత చప్పున అతన్ని తోసేసి, వెనక్కి జరిగి, రోషంతో రొప్పుతూ, కళ్ళలోంచి నిప్పులు కు

పించ సాగింది. తీవ్రమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలకి ఆమె హృదయం అదిరి పడుతూ అణచుకోలేని ఆవేగాన్ని ప్రస్ఫుటం చేస్తోంది.

డాక్టర్ తత్తర పడ్డాడు..

"సారీ, ప్లీజ్. ఇదిగో ఈ వంద ఆఫీసులో జమ కట్టండి. పేషెంట్‌కి త్వరలో రక్తం ఇద్దాం." అని బల్లమీద వందరూపాయల నోటు పడేసి చరచర స్ప్రింగ్ డోర్ తెరుచుకుని గది బయటికి వెళ్ళి అతను గట్టిగా అరిచాడు.

"సిస్టర్, ఆ షరాబ్ బజార్లో ఏక్సిడెంటయిన పేషెంటుకి త్వరగా బ్లడ్ ఇవ్వాలి. వెంటనే బ్లడ్ బాటిల్ తెప్పించి బ్లడ్‌ట్రాన్స్ ఫ్యూషన్ ఆపరేటస్ అరేంజి చెయ్యి."

"బద్మాష్" అని గట్టిగా అరవాలనిపించింది సుజాతకి. కాని ఏదో బలహీనత అకస్మాత్తుగా ఆవహించి ఆమె పెదవుల్ని నొక్కివేసింది. బ్లడ్ బాటిల్ ఆమె మనసులో తాండవ మాడింది.

"రక్తమూ ఓ ధరగల వస్తువేసుజా" అన్న విశ్వం మాటలు ఆమెచెవుల్లో మారుమ్రోగాయి.

అవును. రక్త మేమిటి ! ప్రపంచంలో అన్నీ ధరగల వస్తువులే. వాటికి ఖరీదుల అట్టముక్కలు అందంగా వ్రేళ్ళాడుతూ ఉంటాయి ! బల్లమీద వందరూపాయల నోటు తీసుకుని పెదవుల్నీ, కన్నీటి కెరటాల్నీ తుడుచుకుని సుజాత బరువుగా ఆసుపత్రి ఆఫీసు వైపు నడిచింది.

(1967)

... Shanthi Reading Room,
... Mirzalguda, Secunderabad-17.